# సాక్షి మహబూబాబాద్

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



**'అమ్మల'పాదిలో..**
ఉప్పొంగిన భక్తిభావం.. పోటెత్తిన భక్తులు

**వీవీఐపీల రాకతో అవస్థలు**
పలుమార్లు వనదేవతల దర్శనాల నిలిపివేత

10లో▸

**వనదేవతలు.. వరాల తల్లులు**
అమ్మలను మనస్ఫూర్తిగా దర్శించుకున్నాం

**అమాంతం ఆకాశానికి..**
రూ.వెయ్యికి చేరిన కోడి ధర

**కనిపిస్తే మాయమే..**
మేడారంలో దొంగల చేతివాటం

**అడవులు, సంస్కృతిని కాపాడాలి**
పద్మశ్రీ దరిపల్లి రామయ్య

8లో▸


## న్యూస్‌రీల్

### పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పది, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు మార్చి 18నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో సుమారు 8,500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ కొనసాగుతుందని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలు ఈనెల 28నుంచి మార్చి 14వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలోని 19కేంద్రాల్లో 9,000 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విధులపై అవగాహన ఉండాలి



మహబూబాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది సహకారం ఎంతో అవసరమని, విధులపై పూర్తిస్థాయి అవగాహన పొందాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల విధుల నిర్వహణపై అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయి అవగాహనతో పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాలకు తరలింపు భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారంలో చెక్ పోస్ట్‌ల వద్ద వాహనాల చెకింగ్, ర్యాలీలు, సమావేశాలపై నిఘా పెంచాలన్నారు. విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు. అదనపు ఎస్పీ చెన్నయ్య మాట్లాడారు. వాహనాల తనిఖీల్లో పారదర్శకత పాటించాలన్నారు.

**పాత్ర కీలకం..**

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల విధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ నిర్వహణ అనంతరం ఈవీఎంలు రిసెప్షన్ సెంటర్‌కు చేరే వరకు సెక్టోరియల్ అధికారులు వెంట ఉండాలన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఓ, స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి పురుషోత్తం అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురుషోత్తం మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటింగ్‌శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, ఎంపీడీఓ రవికుమార్, డీఈ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, డీఎంసీ విజయ పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

గార్ల: గార్ల సీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గార్ల సీహెచ్‌సీలో 12 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



శుక్రవారం రాత్రి భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం



# మనసారా మొక్కులు

మదినిండా భక్తితో కీకారణ్యంలో కాలుమోపారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. వాగొడ్డున తలనీలాలు సమర్పించిన భక్తులు అమ్మల గద్దెల వద్దకు చేరి తన్మయత్వంతో ఊగిపోయారు. 'జంపన్న అబ్బియో.. సారక్కా అబ్బియో.. సమ్మక్కా శరణు.. తల్లులకు పదివేల దండాలే అబ్బియో'.. అంటూ శివసత్తుల పూనకాలతో భక్తుల్లో జోష్ నిండుకుంది. జై సమ్మక్క.. జయహో సారలమ్మ నినాదాలతో హోరెత్తించారు. వనదేవతలకు బంగారం(బెల్లం), కానుకలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు.

- గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- దర్శించుకుని పులకించిన భక్తజనం
- రోజంతా కొనసాగిన రద్దీ
- నేడు వన ప్రవేశంతో ముగియనున్న మహాజాతర

మేడారం(ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి):

మేడారంలో వనదేవతలకు భక్తులు మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల చెంతకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆదివాసీల ఇలవేల్పులు గద్దెలపై ఆసీనులై ఉండగా.. 'దండుగా కదిలొచ్చి దండిగా మొక్కులు' తీర్చుకున్నారు. మదినిండా భక్తిపారవశ్యంతో తమ కష్టాలు, కోరికలు తీర్చాలని వేడుకున్నారు. కోరికలు తీరితే మళ్లొచ్చే జాతరలో ఎత్తు బంగారం, కానుకలు, తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకున్నారు. నలుదిక్కుల నుంచి తరలివచ్చిన భక్తుల దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి. సమ్మక్క, సారలమ్మ నినాదాలతో జాతర ప్రాంగణం మార్మోగింది.

**వాగులో స్నానాలు.. తలనీలాల సమర్పణ**

తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు మొదట జంపన్న వాగులో స్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో శివసత్తులు పూనకాలతో శివాలూగారు. సైకత శివలింగాలను తయారు చేసి పూజలు చేశారు. అనంతరం అమ్మల సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించి వాటిలో కొద్దిగా గద్దెల వద్ద ముడుపు చెల్లింపుగా వేశారు. సంతానం లేని వారు రావిచెట్టు వద్ద ఊయల కట్టి వరం పట్టారు. ఈ క్రమంలో గద్దెల నుంచి బంగారం(బెల్లం), కుంకుమ, పసుపును మహాభాగ్యంగా తీసుకొని ఇళ్లకు వెళ్లారు. నాయకపోడు ఇలవేల్పు లక్ష్మీదేవర సైతం గద్దెల వద్దకు చేరుకుంది. అక్కడ నాయకపోడు వర్గం వారు మొక్కులు చెల్లించి, తిరిగి వారి స్వస్థలాలకు వెళ్లారు. కాగా మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసిన భక్తులు తాగునీటి నల్లాలు, పంపుల వద్ద క్యూకట్టారు. ట్యాంకర్లు, నల్లాలు ఉన్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తప్పలేదు.

**పలు రాష్ట్రాల నుంచి..**

ఆంధ్రా, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాల నుంచి గురువారం రాత్రి నుంచే భక్తుల రాక పెరిగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే గద్దెల వద్ద రద్దీ నెలకొంది. క్యూ లైన్లు నిండిపోయి భక్తులు రోడ్డుపైకి చేరుకున్నారు. పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లలో వెళ్లేలా చూశారు. రాత్రి వరకు దాదాపు కోటిమంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

**కానుకల చెల్లింపు..**

భక్తులు వనదేవతలకు ఇష్టమైన బంగారం(బెల్లం), కానుకలు చెల్లించి మొక్కులు అప్పగించారు. ఒడి బియ్యం, పసుపు, కుంకుమ గద్దెలపైకి నిరంతరాయంగా చల్లారు. రోజంతా భక్తుల రద్దీ కొనసాగడంతో గద్దెల ప్రాంగణంలో భక్తిపారవశ్యం ఉప్పొంగింది. భక్తుల కానుకలతో నిండిన హుండీలను ఎప్పటికప్పుడు పక్కకు తరలించారు. గద్దెలపై ఉన్న బంగారం(ప్రసాదం) తీసుకోవడానికి భక్తులు పోటీపడ్డారు.

**వస్తున్నారు.. పోతున్నారు..**

జాతరకు రెండు రోజులు ముందుగానే చేరుకున్న భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని విడిది చేశారు. బుధవారం సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరుకోవడంతో ఆరోజు రాత్రి నుంచే మొక్కులు ఊపందుకున్నాయి. అమ్మలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్న భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచి ఇంటిబాట పట్టారు. తిరుగు ప్రయాణం భక్తులతో ఆర్టీసీ బస్‌స్టేషన్ పాయింట్ కిక్కిరిసిపోయింది. వీఐపీల వాహనాలు, దర్శనాలకు ఇచ్చిన ప్రాధాన్యత సామాన్య భక్తులకు దక్కలేదు. మేడారం జాతరలో పోలీసులే కీలమైనప్పటికీ.. వారి తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎత్తు బంగారం తూకం వేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





**తల్లుల దర్శనం మూడోసారి**
గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

10లో▸

**సమ్మక్క-సారలమ్మ పోరాటం ఆదర్శం**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## హిజ్రాల బీభత్సం

### ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేసిన ట్రాన్స్‌జెండర్లు



గేట్లు ధ్వంసం కావడంతో బారికేడ్లు పెట్టిన పోలీసులు

మేడారం(వరంగల్ క్రైం) : మేడారం మహాజాతరలో హిజ్రాలు శుక్రవారం బీభత్సం సృష్టించారు. ప్రత్యేకంగా అమ్మవార్ల దర్శనం చేయించాలని డిమాండ్ చేయగా.. విధిలేక అధికారులు సర్కిల్ దగ్గర ఉన్న ద్వారాన్ని తెరిచారు. లోనికి వెళ్లిన హిజ్రాలు.. గద్దెల వద్దకు వెళ్లే ప్రధాన ద్వారం సైతం తెరవాలని పట్టుపట్టారు. హిజ్రాలతోపాటు ఇతర భక్తులు కూడా అదే ద్వారం నుంచి పెద్ద ఎత్తున రావడంతో తెరవడానికి నిరాకరించారు. దీంతో అసహనానికి గురైన హిజ్రాలు ప్రధాన ద్వారాన్ని అటూ ఇటూ ఊపుతూ పూర్తిగా తొలగించారు. పోలీసులు ఏమీ చేయలేక మిన్నకుండి పోయారు. తొలగించిన ద్వారం నుంచి అందరూ ఒకేసారి లోనికి ప్రవేశించడంతో తోపులాట జరిగింది. ఇదిలా ఉండగా ఉదయం కూడా హిజ్రాలు, సాధారణ భక్తుల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఇద్దరు చిన్న పిల్లలు గాయపడి అస్వస్థతకు గురయ్యారు.

సీఎం వచ్చే ముందు ఖాళీగా ఉన్న గద్దెల ప్రాంగణం





సీఎం వెళ్లిన తర్వాత కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం

### ప్రముఖుల రాక... భక్తుల కేక

మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి శుక్రవారం ప్రముఖులు తరలి రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తోపాటు పలువురు మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. వారు వనదేవతలను దర్శించుకుని బయటికి బయలుదేరేంతవరకు ప్రొటోకాల్ పేరిట భక్తులను పోలీసు అధికారులు రాకుండా నిలిపివేశారు గంటల తరబడి నిరీక్షించిన భక్తులు ఆగ్రహంతో వారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేయడం గమనార్హం.

– మేడారం(వరంగల్)



### ట్రాఫిక్ జాంతో భక్తుల ఇక్కట్లు

- 10లో▸

తాడ్వాయి–పస్రా మధ్య కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు



తిరుగు ప్రయాణంలో మేడారం బస్టాండ్‌లో కిక్కిరిసిన భక్తులు

# వనదేవతలు.. వరాల తల్లులు

## అమ్మలను మనస్ఫూర్తిగా దర్శించుకున్నాం

- ప్రతీ జాతరకు కచ్చితంగా వస్తాం
- మేడారం భక్తుల మనోగతం

**మేడారం(ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి):** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం. ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు హాజరై తల్లులకు తనివితీరా మొక్కులు చెల్లిస్తారు. పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తుబంగారం ( బెల్లం) సమర్పించి మనసారా మొక్కులు చెల్లిస్తారు. పాడిపంటలతో కళకళలాడాలని, పిల్లాపాపలను చల్లంగా చూడాలని, సంతాన భాగ్యం కలగాలని వనదేవతలకు ప్రణమిల్లుతారు. శుక్రవారం తమ ఆరాధ్యదైవాలకు మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు 'సాక్షి'తో తమ మనోగతం వెల్లడించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

### అమ్మకు మొక్కితే బిడ్డ పుట్టింది

గత జాతరకు వచ్చి అమ్మ వారిని మొక్కితే నాకు బిడ్డపుట్టింది. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినా. బిడ్డకు సహస్ర అని అమ్మవారు పేరుకలిసేలా పెట్టుకున్నా. ప్రతి జాతరకు వచ్చి దర్శించుకుంటాం.

**- ఇంద్రానీ, రాయలసీమ**

### ఇల్లు కట్టుకున్న..

మూడేళ్ల క్రితం జాతరకు వచ్చినప్పుడు అమ్మవారికి మొక్కుకున్న. ఇళ్లు కట్టుకున్నా. మొక్కు తీర్చుకునేందుకు వచ్చినా. వెండి ఇల్లును అమ్మవారికి సమర్పించినా. తల్లి చల్లంగా చూడాలని వేడుకున్నా.

**- గడ్డం సరస్వతి, ఆదిలాబాద్**

### తల్లుల దర్శనం ఎంతో పుణ్యం

మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుంది. క్యూలైన్ ద్వారా కుటుంబ సభ్యులతో కలిసి తల్లులను దర్శించుకున్నాం. అమ్మవార్లను కళ్లారా చూసినం. ప్రతీ జాతరకు కచ్చితంగా మేడారం వస్తాం. అయితే క్యూలైన్లలో నీరు, మజ్జిక లాంటి పదార్థాలు ఏర్పాటు చేస్తే బాగుండేది.

**- కొట్టె ఉమాదేవి, గోదావరిఖని**

### ప్రసాదం అందరికీ అందేలా చూడాలి

తల్లుల ప్రసాదం అందరికీ అందేలా చూడాలి. వన దేవతల ప్రసాదం తీసుకుంటేనే మాకు తృప్తి. అందుకోసం ఎంతసమయమైనా వేచి ఉంటాం. అయితే గద్దెల వద్ద సౌకర్యాలు పెంచాలి. అమ్మవారి ప్రసాదం కోసం గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది.

**- సువర్ణ, కరీమాబాద్**

### తల్లుల దర్శనం మహాభాగ్యం..

తల్లుల దర్శనం మహాభాగ్యం. కోరికలు నెరవేర్చే తల్లుల సన్నిధికి ప్రతీ జాతరకు వస్తాం. అయితే జాతరలో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగాలేవు. దీంతో ఇబ్బంది పడ్డాం. అధికారులు గుర్తించి సమస్య పరిష్కరించాలి.

**- కోమలత, హైదరాబాద్**


జాతరలో దుకాణాల ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలు

### పడకేసిన పారిశుద్ధ్యం..

**మేడారం(వరంగల్/భూపాలపల్లి అర్బన్):** మేడారంలో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా యంత్రాంగం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. జాతరలో సుమారు 4వేలకు పైగా మంది పారిశుద్ధ్య కార్మికుల సేవలు వినియోగించుకుంటున్నామని చెప్పారు. నిర్దేశించుకున్న ప్రకారం జాతర సమయంలో కార్మికులను ఏర్పాటు చేయకపోవడంతో మేడారం పరిసరాలు కంపు కొడుతున్నాయి. కేవలం జంపన్నవాగు, అధికారులు బస చేసిన ప్రాంతాలు మినహాయిస్తే పలు ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. డీపీఓ నిర్లక్ష్యంతోనే పారిశుద్ధ్యం పడకేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.






జాతరలో భక్తుల రద్దీ





# భక్తకోటి.. జైకొట్టి

ఆదివాసీల ఆరాధ్యదైవాలు వనదేవతల దర్శనంతో భక్తకోటి పులకించింది. మేడారం మహాజాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులుకు ఒకేసారి మొక్కులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తుబంగారం ( బెల్లం) సమర్పించి మనసారా మొక్కుకున్నారు. ఏపీ, తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో హాజరై తల్లులను దర్శించుకున్నారు. కాగా, శనివారం తల్లుల వన ప్రవేశంతో మేడారం మహాజాతర ముగుస్తుంది.


సెల్ఫీ దిగుతున్న భక్తులు









జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


### ట్రాన్స్‌జెండర్స్.. వండర్స్

- జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న హిజ్రాలు

**మేడారం(వరంగల్):** మేడారంలో హిజ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. జాతర మొదలుకాగానే కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సమ్మక్క తల్లిని ఆవాహన చేసుకుని మట్టితో అమ్మవార్ల గద్దెలను ఏర్పాటు చేసి బంగారం (బెల్లం), మద్యం సమర్పించి కోళ్లు, మేకలను బలి ఇస్తారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్క రాక సందర్భంగా దారి వెంట ముగ్గులు(పట్నాలు) వేసి స్వాగతం పలుకుతారు. తల్లి గద్దెలకు చేరుకున్న తర్వాత ఒడి బియ్యం, బంగారం(బెల్లం), కొబ్బరి కాయలు సమర్పిస్తారు.


మేడారంలో మొక్కులు పెడుతున్న హిజ్రాలు

### అడవులు, సంస్కృతిని కాపాడాలి



**మేడారం(కాళేశ్వరం):** అడవులు, సంస్కృతిని కాపాడాలని పద్మశ్రీ దరిపల్లి రామయ్య.. ప్రజలను కోరారు. ఈ మేరకు శుక్రవారం మేడారంలో చేనేత వస్త్రంపై చేతితో వేసిన గిరిజన కళా వస్తువులు, స్మారక చిహ్నాలు, జ్ఞాపికలకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కాగా, మేడారం జాతరలో కలియతిరుగుతూ పర్యావరణ పరిరక్షణపై భక్తులకు అవగాహన కల్పించారు. వారి వెంట అనిల్, కోట రినీత్‌కుమార్ ఉన్నారు. అంతకు ముందు తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### దూరం.. భారం

**మేడారం(రామన్నపేట) :** మేడారంలో ఆర్టీసీ బస్టాండ్.. జంపన్న వాగు, గద్దెలకు అర కిలో మీటర్ దూరం పెంచారు. దీంతో బస్సు దిగిన అనంతరం భక్తులు ఆయా చోట్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిరుగు ప్రయాణంలో బస్టాండ్ దూరం తగ్గించిన అధికారులు.. మొక్కులు చెల్లింపుల సమయంలో మాత్రం పెంచడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


బస్సుల్లో మేడారం జాతరకు వస్తున్న భక్తులు

### అమాంతం ఆకాశానికి..

కోడి @ రూ.వెయ్యి


మేడారంలో ఖాళీ అయిన కోళ్ల దుకాణం

**కాటారం:** మేడారం జాతరలో కోళ్ల ధరలు అమాంతం కొండెక్కాయి. జాతర మూడో రోజులో భాగంగా కోడి ధరలు భక్తులకు చుక్కలు చూపించాయి. వ్యాపారులు ఒక్కో కోడి ధర రూ.వెయ్యికి పెంచడంతో భక్తులు ఖంగుతిన్నారు. కాగా, పోలీసులు కోళ్ల వాహనాలను జాతరలోకి అనుమతించలేదని వ్యాపారులు తెలిపారు. ఫలితంగా సరఫరా లేకపోవడంతో ధర పెంచాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు.

### కనిపిస్తే మాయమే..

- మేడారంలో దొంగల చేతివాటం
- లక్షలాది రూపాయల నగదు, బంగారం, ఇతర వస్తువుల అపహరణ
- లబోదిబోమంటున్న భక్తులు

**వరంగల్ క్రైం :** మేడారం మహాజాతరలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. లక్షలాది రూపాయలు, బంగారం, ఇతర వస్తువులను తస్కరిస్తున్నారు. జంపన్న వాగు వద్ద భక్తులు స్నానమచరించడానికి వాగులో దిగగా చాలా మంది బ్యాగులను మాయం చేస్తున్నారు. వందల సంఖ్యలో పోలీసులు బందోబస్తు చేస్తున్న ఏమాత్రం బెదరకుండా చోరీలకు పాల్పడుతున్నారు. మేడారం పోలీసుల కథనం ప్రకారం జాతరలో బుధవారం సుమారు 14, గురువారం 16, శుక్రవారం 15 చోరీలు జరిగాయి. భక్తులు పెద్ద మొత్తంలో నగదు, బంగారు అభరణాలు పోగొట్టుకున్నారు. శుక్రవారం గద్దెల దగ్గర పెద్దపల్లికి చెందిన మల్దోవుల శ్రీనివాస్‌కు చెందిన రూ. లక్ష విలువైన బంగారం, దుగ్గొండికి చెందిన వోల్లే రాధక్కకు చెందిన రూ. 2 లక్షల విలువైన బంగారం జంపన్న వాగు వద్ద అపహరించారు. రామగుండానికి చెందిన దొంతరవేణా రాజమ్మకు చెందిన రూ.1.80 లక్షల విలువైన బంగారం మాయం చేశారు. గోదావరిఖనికి చెందిన నాగవెల్లి పద్మ కు సంబంధించిన రూ.1.80 లక్షల విలువైన బంగారం అపహరణకు గురైంది.

### సెల్ఫీ సందడి..


మ్యూజియంలో సెల్ఫీ దిగుతున్న భక్తులు

**మేడారం (కన్నాయిగూడెం):** మేడారంలోని గిరిజన మ్యూజియాన్ని భక్తులు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

### రక్షణగా ఖాకీలు..


ప్రముఖులకు స్టోన్‌గార్డులతో రక్షణ కల్పిస్తున్న పోలీసులు

**మేడారం :** వన దేవతల దర్శనంలో భాగంగా గద్దెల పైకి వచ్చి మొక్కులు చెల్లించుకునే ప్రముఖులు, వీఐపీలకు పోలీసులు రక్షణగా నిలుస్తున్నారు. భక్తులు దూరం నుంచి గద్దెల పైకి విసిరే బంగారం, కానుకలు ప్రముఖుల తలలకు తగలకుండా పోలీసులు స్టోన్‌గార్డులను అడ్డుగా ఉంచుతున్నారు. కాగా, రక్షణ కల్పిస్తున్న సమయంలో పోలీసు సిబ్బందికి గాయాలైన ఘటనలూ లేకపోలేదు.

### మేడారంలో బీఎస్ఎన్ఎల్ సేవలు

**మేడారం(వరంగల్):** ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం జాతర కోసం ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ లక్షలాది రూపాయలు వెచ్చించి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా 5 శాశ్వత, 9 తాత్కాలిక టవర్స్ ఏర్పాటు చేసింది. ఐటీడీఏ, డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు హైస్పీడ్ ఇంటర్నెట్ లీజ్డ్ లైన్ ఇచ్చింది. 24/7 గంటల పాటు నెట్‌వర్క్ మెయింటనెన్స్, మానిటరింగ్ కోసం 20 మంది డెడికేటెడ్ ఇంజనీర్స్ విధులు నిర్వహించినట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు.


మేడారంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు

### 'ఎర్రబెల్లి' కాన్వాయ్ అడ్డగింత..

**మేడారం(వరంగల్):** మేడారంలోని సమక్క, సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాన్వాయ్‌ను వీవీఐపీ చెక్‌పోస్ట్ దగ్గరే పోలీసులు అడ్డగించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు మరో రెండు వాహనాలు వస్తున్న క్రమంలో అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. 'వీవీఐపీ హోదాలో మీ వాహనాన్ని మాత్రమే గద్దెల వరకు అనుమతిస్తామని, మిగతా వాహనాలను వీవీఐపీ పార్కింగ్ చేసుకోవాలని' పోలీసులు దయాకర్‌రావు దృష్టికి తీసుకుపోవడంతో చేసేది ఏమి లేక ఆయన తన వాహనంలో గద్దెల వరకు వెళ్లారు.

### భక్తుల తిరుగు ప్రయాణం..

**మేడారం(భూపాలపల్లి అర్బన్/ములుగు రూరల్/మంగపేట:):** తల్లుల దర్శనం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారం తరలివచ్చిన భక్తులు శుక్రవారం ఉదయం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మేడారం జాతరలో నాలుగు రోజులు బస చేసి తల్లలను దర్శించుకున్న అనంతరం తమ స్వస్థలాలకు తరలారు. కాగా, మేడారం బస్టాండ్ క్యూలైన్‌ల్లో భక్తులు గంటల కొద్ది నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పిల్లపాపలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్‌ల వద్ద తాగునీటి వసతి కల్పించకపోవడంపై ఆర్టీసీ అధికారుల తీరుపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


ట్రాక్టర్‌లో సామాన్లు సర్దుకుంటున్న భక్తులు